# 15న సెక్రటేరియట్ ముట్టడి

- సీఎం రేవంత్‌రెడ్డిని నిరుద్యోగులే దించుతారు
- యూత్ డిక్లరేషన్ పేరుతో నిండాముంచిన కాంగ్రెస్
- విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య గౌరవాధ్యక్షుడు రాజారాం యాదవ్
- ఓయూ విద్యార్థి నేత మోతీలాల్ నాయక్ దీక్షకు మద్దతు
- అమరవీరుల స్థూపం వద్ద నిరుద్యోగుల నిరసన



గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన చేపట్టిన పలు సంఘాల నేతలు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు వైఖరికి నిరసనగా 15న నిరుద్యోగులతో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు రాజారాం యాదవ్ ప్రకటించారు. తెలంగాణ నిరుద్యోగులను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి దగాచేసిన వైనాన్ని జాతీయస్థాయిలో ఎండగడతామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని నిరుద్యోగులే గద్దె దించుతారని స్పష్టం చేశారు. హైదరాబాద్ గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఓయూ విద్యార్థి నేత మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా శనివారం అసెంబ్లీ ఎదుట అమరవీరుల స్థూపం వద్ద నిరుద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి గోషామహల్ స్టేడియానికి తరలించారు. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి నిరుద్యోగుల కోసం నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్‌కు ప్రాణహాని జరిగితే.. ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల కొనుగోలుపై ఉన్న శ్రద్ధ విద్యార్థి నేత మోతీలాల్ నాయక్ ఆరోగ్యంపై లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాకముందు రాహుల్‌గాంధీని అశోక్‌నగర్ చౌరస్తాలో టీ తాగించి, డ్రామాలాడించి, నిరుద్యోగులను రెచ్చగొట్టి, వారి ద్వారా అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు వారి పట్ల నిర్లక్ష్యం వహించడం అత్యంత హేయమని చర్యగా పేర్కొన్నారు. ఆ రోజు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, 2 లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ఇచ్చిన మాటను నేడు విస్మరించడాన్ని తప్పుబట్టారు. గ్రూప్-2లో 2,000, గ్రూప్-3లో 3,000 వరకు పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. డీఎస్సీలో టీచర్ పోస్టుల సంఖ్యను 25 వేలకు పెంచాలని, రూ.4,000 నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు సంజీవ నాయక్, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య అధ్యక్షుడు కొంపల్లి రాజు, తెలంగాణ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, బీసీ జనసభ రాష్ట్ర నాయకుడు తొడంగి గోవర్ధన్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్ ముదిరాజు, శ్రీకృష్ణ యాదవ సంఘం యాదద్రి జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేశం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త చట్టాలపై 'సమాహార' యాప్

**రూపొందించిన ప్రాసిక్యూషన్ విభాగం**

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): జూలై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై సమగ్ర సమాచారంతో తెలంగాణ ప్రాసిక్యూషన్ విభాగం ప్రత్యేకంగా 'సమాహార' పేరిట యాప్‌ను రూపొందించింది. దీంతోపాటుగా ప్రత్యేకంగా ఓ హ్యాండ్ బుక్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. వీటిని రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా జితేందర్ ఆవిష్కరించి, ప్రాసిక్యూషన్ టీమ్‌ను అభినందించారు. కొత్త చట్టాల్లోని పలు సెక్షన్లకు సంక్షిప్త వివరణలు, పోలిక పట్టికలు, రెడీ రిఫరెన్సులు, మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా సామాన్యులకు సైతం సులువుగా అర్థమవుతాయని తెలిపారు. కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులకు కరదీపికగా పని చేస్తుందని చెప్పారు.

## త్వరలో నాలుగో రైల్వే లైన్

- ఎస్‌సీఆర్ ప్రధాన మార్గాల్లో నిర్మాణానికి కసరత్తు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జోన్ పరిధిలోని ప్రధాన మార్గాల్లో కొత్తగా నాలుగో లైన్‌ను నిర్మించాలని రైల్వేశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలుస్తున్నది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికులు, సరుకు రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాలుగో లైన్ నిర్మాణానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వే పనులు కూడా ప్రారంభించినట్టు సమాచారం. ప్రస్తుతం కాజీపేట-విజయవాడ, కాజీపేట-బలార్ష సెక్షన్లలో మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తయ్యాకే నాలుగో లైన్ పనులు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరలోనే రైల్వేశాఖకు సమర్పించే అవకాశాలు ఉన్నాయి. త్వరలో ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో నాలుగో లైన్ ప్రస్తావనకు వచ్చే అవకాశాలున్నాయని చెప్తున్నారు. ప్రయాణికుల సంక్షేమం కంటే పారిశ్రామిక ప్రయోజనాల కోసం అదనపు రైల్వే మార్గాల నిర్మాణాన్ని చేపడుతున్నదని రైల్వే ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అంటున్నారు. అధిక ఆదాయం వచ్చే వందే భారత్ రైళ్లపై ఉన్న ప్రేమ 'పేదోడి బండి'గా చెప్పుకునే ప్యాసింజర్ రైళ్లపై చూపడం లేదని విమర్శిస్తున్నారు.

## కరెంట్ కోతలను నిరసిస్తూ సబ్ స్టేషన్ ముట్టడి




సిరికొండ, జూన్ 29: కరెంట్ కోతలను నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా సిరికొండ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం స్థానిక సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. కొంత కాలంగా విద్యుత్తు సమస్యలు వేధిస్తున్నాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కోతలు విధించడమేమిటని ప్రశ్నించారు. లో వోల్టేజ్‌తో ఇళ్లల్లో ఫ్రిజ్‌లు, టీవీలు, కూలర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఏఈ చంద్రశేఖర్ స్పందిస్తూ త్వరలోనే విద్యుత్తు సమస్యను పరిష్కరిస్తామని, అవసరమైన చోట స్తంభాలు వేయిస్తామని హామీ ఇచ్చారు.

## 'గృహజ్యోతి'కి కష్టం



గృహజ్యోతి పథకం కోసం ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. గతంలో ఆరు గ్యారెంటీలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించినా ఆన్‌లైన్‌లో నమోదు చేసినా వివరాలు సక్రమంగా లేకపోవడంతో చాలా మందికి జీరో కరెంట్ బిల్లుకు అర్హులు కాలేదు. మరోసారి ఈ పథకానికి లబ్ధిదారులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ఉమ్మడి మండల వాసులు శనివారం ఎంపీడీవో కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మధ్యాహ్నం తర్వాత సర్వర్ ప్రాబ్లం ఏర్పడటంతో గంటల తరబడి క్యూలో నిలబడిన ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. - దేవరకద్ర

## డీఎస్సీ వాయిదా వేయాలి




ఖమ్మం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద శనివారం నిరుద్యోగ అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. వందలాది మంది ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నోటిఫికేషన్‌లో ఉన్న పోస్టులకు అదనంగా పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ షెడ్యూల్‌ను మూడు నెలలపాటు వాయిదా వేయాలని, ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులను ఈ డీఎస్సీలోనే కలపాలని డిమాండ్ చేశారు.- ఖమ్మం ఎడ్యుకేషన్

## ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల నిరసన




నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో శనివారం సాయంత్రం విద్యార్థులు నిరసన చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ట్రిపుల్ ఐటీలోని అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట బైఠాయించారు. తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సోలిడారిటీ (టీఎస్‌ఏఎస్) ఏర్పాటు చేయాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాదాపు వంద మంది విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. - బాసర




# జీహెచ్‌ఎంసీలోకి కంటోన్మెంట్

- విలీనానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్
- సివిల్ ఏరియా ఆస్తులు, మౌలిక వసతులు బదిలీ
- కేసీఆర్ ప్రభుత్వ కృషికి ఫలితం




హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్29 (నమస్తే తెలంగాణ) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు జీహెచ్‌ఎంసీలో విలీనానికి మార్గం సుగమమైంది. బీఆర్‌ఎస్ హయాంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చేసిన కృషికి ఫలితం దక్కింది. ఈనెల 25న కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో వీడియో కాన్ఫరెన్స్‌లో అభిప్రాయాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కంటోన్మెంట్ విలీనానికి అంగీకరించడంతో రక్షణ శాఖ ప్రిన్సిపల్ డిప్యూటీ డైరెక్టర్ సదరన్ కమాండ్ హేమంత్ యాదవ్ కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రకారం కంటోన్మెంట్‌లోని సివిల్ ఏరియాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తారు. అక్కడి ప్రజలకు నిర్దేశించిన సౌకర్యాలు, మౌలిక వసతులన్నీ ఉచితంగా జీహెచ్‌ఎంసీకి బదిలీ చేస్తారు. కంటోన్మెంట్ బోర్డుల ఆస్తులు, అప్పులన్నీ మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. మిలటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్‌లోని నివాస ప్రాంతాలకు జీహెచ్‌ఎంసీ పరిధి విస్తరిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపి చర్యలు తీసుకోవాలని రక్షణశాఖ బోర్డు అధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం పేరిట ఉన్న భూములు, ఆస్తులు కేంద్రానికే దక్కుతాయి. ఈ ప్రాంతాలను విభజించేటప్పుడు సాయుధ దళాల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు బాధ్యుల సందేహాలను నివృత్తి చేసి తదుపరి కార్యాచరణ చేపట్టాలని కేంద్రం సూచించింది.



నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ పాలకేంద్రం వద్ద క్యాన్లతో పాడి రైతుల నిరసన

## పాల బకాయిలు చెల్లించాలని రాస్తారోకో

గోవిందరావుపేట/వెల్దండ, జూన్ 29 : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని జాతీయ రహదారిపై శనివారం పాల ఉత్పత్తిదారులు రాస్తారోకో నిర్వహించారు. గోవిందరావుపేట, తాడ్వాయి మండలాలకు చెందిన పాల ఉత్పత్తిదారులు పస్రాకు చేరుకొని జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకుడు సూరపనేని వెంకటసురేశ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాల ఉత్పత్తిదారులు రైతులకు ప్రభుత్వ ధర కంటే ఎక్కువ చెల్లిస్తున్నా పట్టించుకోకుండా, విజయ డెయిరీకి విక్రయిస్తున్నట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ సర్కార్ 15 రోజులకోసారి బిల్లులు చెల్లించేదని, పాల ఉత్పత్తిదారుల బాధలను చూసి లీటరుకు రూ.4 బోనస్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం రెండు నెలలు కావొస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నట్టు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోని పాల కేంద్రం వద్ద రైతులు పాల క్యాన్లతో నిరసన తెలిపారు.

## మున్సిపల్ గది దాటని బతుకమ్మ చీరలు



బతుకమ్మ చీరల పంపిణీ విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో మహిళలకు అందించేందుకు బతుకమ్మ చీరలు వచ్చినప్పటికీ పంపిణీ చేయకపోవడంతో మున్సిపల్ కార్యాలయం రెండో అంతస్తులోని ఓ గదిలో పేరుకుపోయాయి. గత బతుకమ్మ వేడుక సమయంలో మున్సిపల్ కార్యాలయానికి 16,490 చీరలు వచ్చాయి. అరకొర మాత్రమే పంపిణీ చేసి మిగితా వాటిని గదిలో నిల్వ ఉంచారు. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ స్పందిస్తూ.. గతేడాది బతుకమ్మ సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ చేయలేదని తెలిపారు. వీటిని జిల్లా కార్యాలయానికి పంపిస్తామని చెప్పారు. - వేములవాడ

## మేడిగడ్డకు వరద పోటు



మహదేవపూర్, జూన్ 29 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో లక్ష్మీ(మేడిగడ్డ) బరాజ్‌కు వరద పోటెత్తుతున్నది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణహిత ప్రవాహం అంతకంతకూ పెరుగుతున్నది. శుక్రవారం ఇన్‌ఫ్లో 8,790 క్యూసెక్కులు , శనివారం 12 వేల క్యూసెక్కులుగా ఉన్నది. అంతేమొత్తంలో వరదను నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. భారీ వరదల కారణంగా ఏడో బ్లాక్ వద్ద సీఎస్‌ఎంఆర్‌ఎస్ నిపుణులు చేపట్టిన పరిశోధనలు నిలిపోయాయి. పనులకు వినియోగించే భారీ యంత్రాలను ఒడ్డుకు చేర్చారు. బరాజ్‌లో 85 గేట్లను ఎత్తేశారు. వరద ప్రవాహ తీరును భారీ నీటిపారుదల శాఖ ఈఈ తిరుపతి రావు పరిశీలించారు.

